## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



**తెనాలిరూరల్:** ఆటో రైల్వే వంతెన గడ్డర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలవ్వగా మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వేమూరు మండలం పెరవలి నుంచి సోమవారం తెనాలి వస్తున్న ప్రయాణికుల ఆటో పట్టణ వైకుంఠపురం సమీపంలోని రైల్వే బ్రిడ్జి ఇనుప గడ్డర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పెరవలిపాలెంకు చెందిన కంచె సాంబశివరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదే ఆటోలో మరో నలుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ అయిన కారణంగా ప్రమాదం జరిగినట్టు ఆటోడ్రైవర్ చెబుతున్నాడు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వృద్ధాశ్రమాల్లో అన్నదానం



**తెనాలి:** మంగళగిరి కేంద్రంగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం కన్వీనర్, ప్రాంతీయ పర్యవేక్షకుడు ముద్దాభక్తుని రమణయ్య, సమాచార ప్రతినిధి ముద్దాభక్తుని సామ్రాజ్యం దంపతులు వృద్ధులకు అన్నదానం చేశారు. నాజరుపేటలోని 'మన ఇల్లు' వృద్ధాశ్రమం, శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో సేవ కార్యాక్రమాలను నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం చేపట్టారు. ఆయా ఆశ్రమాల నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, మురళి, భారతి, షిరిడీ ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, అనూష, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



**తాడేపల్లిరూరల్:** మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహా నగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉన్నతంగా ఎదగడానికి సరైన ప్రణాళిక ద్వారా ఇష్టంతో చదవాలన్నారు. మిరియాల సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, నైపుణ్యంతో విజయబావుటా ఎగురవేయాలని ఆకాంక్షించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్కే.రసూల్ పాఠశాలలోని విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. దంతాలను రక్షించుకోవాలని ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పళ్లను శుభ్రంగా కడుక్కోవాలని, ఆహారం తీసుకున్న తర్వాత నీళ్లతో తప్పనిసరిగా పుక్కిలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు గుప్త, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, డి. శ్రీనివాసరావు, ఇ.శరత్, బి.బుజ్జిబాబు, కె.వెంకటేశ్వరరావు, రమణమ్మ పాల్గొన్నారు.

### పరిశుభ్ర నగరమే లక్ష్యం



**మంగళగిరి:** మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్(ఎంటీఎంసీ)ని పరిశుభ్రత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఎంటీఎంసీ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. సోమవారం మంగళగిరిలోని రాజీవ్ గృహకల్ప రోడ్డు, టిప్పర్ల బజార్‌ల్లోని కాల్వల సిల్ట్ తొలగింపు పనులతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని సచివాలయాల అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో రహదారులు, డ్రెయిన్‌లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి పరిశుభ్రతకు ప్రజలు సహకరించేలా కృషి చేయాలన్నారు. నగరంలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి స్థలాల్లో జంగిల్ క్లియరన్స్ నిర్వహించేలా చూడాలన్నారు. ఇంటి పన్ను తాగునీటి పన్నులు ఎప్పటికప్పుడు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఏవైనా సమస్యలు వస్తే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఎంపీహెచ్‌వో వెంకటేశ్వరరావు, సచివాలయాల సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సినీ ప్రేక్షకుల మదిలో 'ఊర్వశి' స్థానం పదిలం

- తెలుగు సినీ పరిశ్రమలో నటి శారదకు ప్రత్యేక స్థానం
- ఐదు భాషల్లో 350కి పైగా సినిమాల్లో నటించి ఉత్తమ నటిగా గుర్తింపు
- మలయాళ సూపర్‌స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు
- నేడు తెనాలి కళా తేజం ఊర్వశి శారద 80వ జన్మదినం



**తెనాలి:** నటనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన నటులకు ఇచ్చే జాతీయ అవార్డును మూడుసార్లు అందుకున్న ఏకైక తెలుగు నటి శారద. అమాయక యువతి, కురూపి, ముద్దుల చెల్లెలు, తెలుగింటి ఇల్లాలు, గడసరి అత్త, పోలీసాఫీసర్, నిజాయతీ కలిగిన న్యాయమూర్తి... ఇలాంటి ఏ పాత్రలోనైనా తనదైన ప్రత్యేకతతో మెప్పించగలిగిన ఉత్తమ నటీమణి ఆమె. బాలనటిగా వెండితెరపై అరంగేట్రం చేసి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో 350 పైగా సినిమాల్లో నటించిన శారద అనేక ప్రతిష్టాత్మక పురస్కారాలను స్వీకరించారు. ఆమె 80వ జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం..

కళల తెనాలిలో 1945 జూన్ 25న శారద జన్మించారు. అసలు పేరు తాడిపర్తి సరస్వతీ దేవి. సినిమాల్లోకి వెళ్లాక శారదగా మారింది. పెద్దలు తనకు ఆరేళ్ల వయసు నుంచే భరతనాట్యం, సంగీతం నేర్పించారు. తండ్రి వ్యాపార రీత్యా బర్మా వెళ్లేందుకని చెన్నై వెళ్లినపుడు, అనుకోకుండా ఎన్టీఆర్ నటించిన 'కన్యాశుల్కం' సినిమాలో బాల పాత్రలో నటించింది. తెనాలి తిరిగొచ్చాక 13 ఏళ్ల వయసులో పరుచూరి రాజారాం బృందంలో చేరి నాటకాల్లో నటించసాగారు. చదువు దెబ్బతినటంతో సినిమాల కోసమని మరుసటి ఏడాది చెన్నైకు వెళ్లారు. 'రక్త కన్నీరు' నాటకంలో నాగభూషణం సరసన హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. మరోవైపు నటన నేర్చుకోసాగారు.



ఉభయ రామేశ్వర క్షేత్ర దర్శనంలో..

- 1963లో విడుదలైన అన్నపూర్ణ వారి 'ఇద్దరు మిత్రులు' తన తొలి సినిమా. అందులో అక్కినేని సోదరిగా నటించారు. 'తిరుపతి' అనే నాటకంలో శారదను చూసిన తమిళ హీరో శివాజీ గణేశ్ ఆమెకు 'కుంకుమ' అనే తమిళ సినిమాలో అవకాశం కల్పించారు. ఆమెలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించింది మాత్రం మలయాళ సినిమా రంగమే. 1960 దశకంలో మలయాళంలో ప్రముఖ నటులైన సత్యన్, ప్రేమనజీర్‌తో కలిసి 'వనప్పర్వుకల్'లో నటించిన శారదకు, ఆ సినిమాతో మలయాళ సినిమా రంగంలో సుస్థిరమైన స్థానం లభించింది. 1966లో ఎంటీ వాసుదేవనాయర్ 'ఇరుటింటి ఆత్మవు' లోనూ శారద నటన అద్భుతం అనిపించుకున్నారు. కేఎస్ సేతుమాధవన్, ఎ.విన్సెంట్, పి.భాస్కరన్ వంటి ప్రముఖ దర్శకులతో పనిచేశారు.
- 1968లో శారద నటించిన మలయాళ సినిమా 'తులాభారం'. జాతీయ ఉత్తమ సినిమాగా ఎంపికైంది. ఆ సినిమాలో అమోఘమైన నటనకు శారద, తొలిసారిగా 'ఊర్వశి' అవార్డును అందుకున్నారు. అదే సినిమాను హిందీతో సహా నాలుగు భాషల్లో తీయగా అన్నింటిలోనూ హీరోయిన్‌గా శారదనే తీసుకున్నారు. అలాగే పలు మలయాళ సినిమాల్లో అచ్చమైన భారతీయతను ప్రతిబింబించే మహిళ పాత్రలో శారద చక్కగా ఒదిగిపోయారు.
- ఆదూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వంలో వచ్చిన 'స్వయంవరం' సినిమాలో నటనకు శారద రెండోసారి 'ఊర్వశి' అవార్డును గెలుచుకున్నారు. మలయాళ సినిమా పరిశ్రమను తిరగరాసిందీ సినిమా. 1972లో నాలుగు జాతీయ అవార్డులను కైవసం చేసుకుంది. 1979లో శారద నటించిన 'నిమజ్జనం' సినిమా జాతీయ ఉత్తమ సినిమాగా ఎంపికైంది. ఈ సినిమాతో ముచ్చటగా మూడోసారి 'ఊర్వశి' అవార్డును సగర్వంగా స్వీకరించారు శారద.
- 1982లో జాతీయ అవార్డును అందుకున్న 'ఎలిపత్తాయం' అనే సినిమాలో ఒక విభిన్నమైన పాత్రలో నటించారు. ఈ సినిమా దర్శకుడు ఆదూర్ గోపాలకృష్ణన్‌కు బ్రిటిష్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ అవార్డు లభించింది. భరతన్ దర్శకత్వంలోని 'మిన్నుముంగిట నురుగుచెట్టు'లో హీరో హీరోయిన్ల పాత్రల్లో శారద, ప్రఖ్యాత మలయాళ హీరో నెడుమూడి వేణు నటన శిఖరాగ్రాలకు చేరిందని విమర్శకులు ప్రశంసించారు. శారద మలయాళ సూపర్‌స్టార్‌గా గుర్తింపును తెచ్చుకున్నారు. మలయాళీలకు ఆమె 'చేచి' (అక్క) అయింది.
- ఆ తర్వాత తెలుగు సినిమాలు ఆమె పాత్ర చుట్టూ పరిభ్రమించేలా తీశారు. పురుషాధిక్య తెలుగు సమాజంలో స్త్రీ ఆధిక్యతను ప్రదర్శించే సినిమాల్లో నటించి, ఇక్కడా పాపులర్ కాగలిగారు శారద. 'మనుషులు మారాలి', 'సంబరాల రాంబాబు', 'శారద', 'కాలం మారింది', 'మానవుడు-దానవుడు', 'జీవితచక్రం' వంటి ఎన్నో సినిమాల్లో శారద గుర్తుండిపోయే పాత్రల్లో నటించారు. హిందీలో సంజీవ కుమార్‌కు జోడీగా 'ఊర్వశి' సినిమాలో కురూపిగా, అందమైన అమ్మాయిగా ద్విపాత్రాభినయాన్ని ఎంతో వైవిధ్యభరితంగా పోషించారు.
- రెండో ఇన్నింగ్స్‌లో 'సర్దార్ పాపారాయుడు', 'జస్టిస్ చౌదరి', 'మేజర్ చంద్రకాంత్' సినిమాల్లో ఎన్టీఆర్ భార్యగా 'చండశాసనుడు'లో సోదరిగా ఎన్టీఆర్‌కు ధీటైన నటనను ప్రదర్శించారు. రెండు తరాలకు చెందిన హీరోలు ఎన్టీఆర్, ఏఎన్నార్, జగ్గయ్య, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్‌బాబు, మురళీమోహన్‌తో హీరోయిన్ గానూ, ఆ తర్వాతి తరంలో హీరోలు నాగార్జున, బాలకృష్ణ, చిరంజీవి, వెంకటేష్, మోహన్‌బాబు, ప్రభాస్‌కు తల్లిగా, అత్తగా పలు పాత్రలను పోషించిన మహానటి శారద.
- శారద పేరును, ఆమె ధరించిన పాత్ర పేరును సినిమాల టైటిల్స్‌గా పెట్టటం ఆమెతోనే మొదలయింది. లాయర్‌గా, డాక్టర్‌గా, జడ్జిగా, పంచాయతీ సర్పంచ్‌గా, జిల్లా కలెక్టర్‌గా శారద నటించిన పాత్రలు ఆమెకు నటిగా గుర్తింపును తేవటమే కాదు..మహిళా ప్రేక్షకులను సైతం ప్రభావితం చేశాయి. చిత్తూరు వి.నాగయ్య, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం సహా అనేక అవార్డులను అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.
- అటుపిమ్మట రాజకీయాల్లో ప్రవేశించి 1996లో తెనాలి ఎంపీగా గెలిచారు. కేంద్రంలో పరిణామాల కారణంగా 13 నెలలకే వచ్చిన ఎన్నికల్లో ఓటమి చెందారు. తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు. చెన్నైలో కొన్ని సినిమాలు, టీవీ సీరియల్స్‌లో నటించారు. ప్రస్తుతం పూర్తి విశ్రాంత జీవనంలో ఉన్నారు.

### సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్న బ్యాంకు మేనేజర్లు

**కొల్లిపర:** ఖాతాదారులు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే మోసాలను అరికట్టవచ్చని కొల్లిపర స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎ.రమేష్, తూములూరు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎం.రఘురాం అన్నారు. సోమవారం కొల్లిపర పాలకేంద్రం కల్యాణ మండపంలో ప్రజలకు, ఖాతాదారులకు డిపాజిట్లు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై 'ఈ వర్క్ షాప్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫరేషన్' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్ లో చేర్చబడాలని హార్దిక అక్షరాస్యత కలిగి ఉండాలని, బ్యాంకు ఉత్పత్తులను, బ్యాంకింగ్ సేవలను తెలివిగా ఉపయోగించుకోవాలని కోరారు. పలు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి అశోక్, కుమార్, వై బాబురావు, ఎం.రామకృష్ణ, వి ప్రకాష్‌బాబు, ప్రజలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## పంచాయతీల పటిష్టతకు చొరవ చూపండి

**కేంద్రమంత్రి పెమ్మసానికి బీసీ సంక్షేమ సంఘం వినతి**



కేంద్ర మంత్రి పెమ్మసాని దంపతులకు సత్కారం

**తెనాలి:** పంచాయతీలను పటిష్టం చేయటం ద్వారా గ్రామీణాభివృద్ధి, గ్రామ స్వరాజ్య స్థాపనకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి చేస్తారన్న ఆశాభావాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు వెలిబుచ్చారు. ఉన్నత విద్యావంతులు, ఎంతో సమర్థత కలిగిన నిజాయతీ పరులైన పెమ్మసానిని కేంద్ర మంత్రిగా ఎంపిక చేసిన చంద్రబాబుకు, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తాడేపల్లి జయభేరిలోని మంత్రి స్వగృహంలో ఆదివారం రాత్రి బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి గజమాలతో సత్కరించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ముందుగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించేలా, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన 16వ ఆర్థిక సంఘం నిధులను రాబట్టడం ద్వారా స్థానిక సంస్థలు ముఖ్యంగా గ్రామాలు, పంచాయతీలను బలోపేతం చేస్తామని మంత్రి చెప్పినట్టు శంకరరావు సోమవారం తెనాలిలో తెలియజేశారు. విభజన హామీల అమలుకు, బీసీల హక్కుల పరిరక్షణ వారి సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగుల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు శివరాం బాబాజీ, కోలా అశోక్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, స్వాతి గౌడ్ అలా శివాజీ, కిరణ్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, వేముల కృష్ణ, రామలింగం, తదితరులు పాల్గొన్నారు.

## జులై 1న ఏవీ సుబ్బారావు పురస్కారం ప్రదానం



పోస్టర్ ఆవిష్కరించిన ఆరాధ్యుల వెంకటేశ్వరరావు

**తెనాలి:** ప్రముఖ రంగస్థల నటుడు, 'ఆంధ్ర గాన కోకిల' ఏవీ సుబ్బారావు 94వ జయంతిని ఏవీ సుబ్బారావు రంగస్థల సమాఖ్యకు చెందిన శ్రీ పూర్ణశ్రీ నాట్య కళాసమితి ఆధ్వర్యంలో జులై 1న ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో 13వ రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేస్తామని నిర్వాహకులు, ప్రముఖ రంగస్థల నటుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక శివాజీచౌక్‌లోని ఏవీ సుబ్బారావు విగ్రహం ఎదుట కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మధ్యాహ్నం నుంచి పద్య నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. పాండవోద్యోగం(కర్ణ సందేశం), శ్రీ రామాంజనేయ యుద్ధం (యుద్ధ సన్నివేశం), చింతామణి (ప్రేమ సన్నివేశం), గయోపాఖ్యానం (యుద్ధ సన్నివేశం) ప్రదర్శిస్తారని తెలిపారు. సాయంత్రం జరిగే సభలో వర్ల రామయ్య, కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ, నాయుడు గోపి, నెల్లూరు అడిషనల్ ఎస్పీ సి.విజయభాస్కర్ పాల్గొంటారని చెప్పారు. ఏవీ సుబ్బారావు పేరుతో ఏటా ఇచ్చే రంగస్థల పురస్కారాన్ని ఈ పర్యాయం ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు చింతలపూడి చెంచయ్యకు ప్రదానం చేస్తామని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆరాధ్యుల ఆదినారాయణ, ఆరాధ్యుల నాగరాజు, పి.వెంకటకృష్ణారావు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జీఓ 84ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు

**గుంటూరు ఎడ్యుకేషన్:** మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలలకు గొడ్డలిపెట్టువంటి జీఓ 84ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంపాలెంలోని సంఘ జిల్లా కార్యాలయంలో నగర శాఖ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు గోవిందు వెళాంగిణిరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అప్‌గ్రేడ్ అయిన 54 ఉన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టిబోయిన నరసింహారావు మాట్లాడుతూ 84 జీఓను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కమిటీ చైర్మన్ జె.విజయానంద్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 506, 507 ద్వారా మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలని కోరారు. సీనియర్ నాయకుడు ఎ.రామారావు మాట్లాడుతూ మున్సిపల్, కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీపీఎస్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. మున్సిపల్ పాఠశాలలకు పర్యవేక్షణ అధికారులుగా సీనియర్ ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు ఓ. నాగార్జున, నగర ప్రధాన కార్యదర్శి కె. గోపి, నగర ఉపాధ్యక్షులు వై.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

## కనుల పండువగా శ్రీరామలింగేశ్వరస్వామికి అభిషేకాలు



**నగరంపాలెం:** స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు జరగ్గా, సోమవారం ఉదయం నిత్య పూజలు, భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. అనంతరం కలశ పూజ, శ్రీరామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను ఆలయ అర్చకులు కె.శివకుమారశర్మ, కె.చంద్రశేఖరశర్మ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరగ్గా, సాయంత్రం రుద్ర, నవగ్రహ హోమాలు నిర్వహించారు. ఎం.కె.ఆర్. అయ్యప్పస్వామి ఫౌండేషన్, ఆలయ కమిటీ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, ఆలయ పాలకవర్గం పాల్గొన్నారు.

### మీ కోసంలో 11అర్జీలు

**తెనాలిరూరల్:** తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో 11 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీటిలో రెవిన్యూ శాఖకు చెందినవి ఎనిమిది ఉండగా గృహనిర్మాణ, పంచాయతీరాజ్ శాఖలకు చెందినవి మూడు అర్జీలు ఉన్నట్టు చెప్పారు. వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరిస్తామన్నారు.

### బొల్లి వ్యాధిపై అవగాహన ర్యాలీ



**గుంటూరు మెడికల్:** ప్రపంచ బొల్లి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డెర్మటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ అసోసియేషన్ గుంటూరు, రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్‌థెరిసా విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత మాట్లాడుతూ బొల్లి అంటు వ్యాధి కాదని, చర్మంలో మెలనోసైట్ కణాలు తగ్గడం వలన వస్తుందని తెలిపారు. వ్యాధి నివారణకు అన్ని రకాల మందులు, పూత మందులు, ఫొటోథెరపీ చికిత్సలు, సర్జరీలు, లేజర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వ్యాధి మొదలైనప్పుడే చర్మవ్యాధుల వైద్యులను సంప్రదిస్తే పూర్తిగా నివారించవచ్చు అన్నారు. వివాహం చేసుకోవడానికి బొల్లి మచ్చలు ఏమాత్రం అడ్డు కాదన్నారు. ర్యాలీలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జె.సౌజన్య, డాక్టర్ సీతారామ్, డాక్టర్ ఎ.శిరీష, డాక్టర్ టి.వాణి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ షకీల, డాక్టర్ మన్నెసింధూర, డాక్టర్ నాగేశ్వరమ్మ, డాక్టర్ నీలిమ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు లాల్‌వజీర్, పాల్గొన్నారు.

### ఏఎల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారిగా వినయ్‌కుమార్



**గుంటూరు ఎడ్యుకేషన్:** లాడ్జి సెంటర్లోని ఆంధ్ర లూథరన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఏఎల్) ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారిగా సోషల్ స్టడీస్ విభాగాధిపతి ఎం.వినయ్‌కుమార్‌ను ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల మాట్లాడుతూ సేవాభావంతో సమాజానికి చేతనైన సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ డాక్టర్ అబ్రహం వెస్లీ పాల్గొన్నారు.

## విద్యార్థికి బొమ్మిడాల ట్రస్ట్ ఆర్థిక సాయం



**గుంటూరు ఎడ్యుకేషన్:** గేట్‌లో జాతీయస్థాయిలో సాధించిన రెండో ర్యాంకు ఆధారంగా ముంబై ఐఐటీలో ఎంటెక్ సీటు పొందిన అద్దంకి పట్టణానికి చెందిన ఘంటసాల రవితేజకు బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి సెమిస్టర్‌కు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముందుకు వచ్చారు. సోమవారం కాకానిరోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో విద్యార్థి రవితేజకు రూ.లక్ష చెక్కు అందజేశారు. ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేసిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పొట్టి శ్రీరాములు, గాంధీ క్లబ్స్ చైర్మన్ బంగారుబాబు, కొలిశెట్టి సతీష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మంత్రి మనోహర్‌కు వినతిపత్రం అందిస్తున్న డేటాఎంట్రీ ఆపరేటర్లు

**తెనాలిఅర్బన్:** గ్రామ పంచాయతీల పరిధిలో పని చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. సోమవారం బోసురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో వీరంతా మంత్రిని కలసి వినతిపత్రం ఇచ్చారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆపరేటర్లు తెలిపారు.

## చెత్త బయట వేస్తే చర్యలు తీసుకోండి

**మున్సిపల్ కమిషనర్ శేషన్న**



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

**తెనాలిఅర్బన్:** చెత్తను రోడ్డు, కాల్వల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వ్యాపారులు, పాదచారులతో సమావేశం నిర్వహించారు. దుకాణాల్లో ఉత్పత్తి అయిన చెత్తను కాల్వలో వేయడం వలన పారుదల నిలిచిపోతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం శాంతినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయిన్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనుపమ, ప్రసాద్, బాజీ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## దోమల నివారణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా యూనిట్ అధికారులు, సిబ్బంది

**మంగళగిరి:** వర్షాల నేపథ్యంలో దోమలు పెరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బనారాయణ తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలో ప్రభుత్వాసుపత్రి నుంచి మలేరియా యూనిట్ అధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బనారాయణ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో దోమలు పెరగకుండా ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సిబ్బంది ప్రతి రోజు ఇంటింటికి తిరిగి దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దోమల నివారణకు ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నియంత్రణ ద్వారా మలేరియా, డెంగీ నివారించవచ్చన్నారు. ప్రజలంతా సహకరించి తమ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయాధికారి రాజు నాయక్, ప్రభుత్వాస్పత్రి వైద్యులు గీతా మాధురి, స్నేహరాజు, యూనిట్ మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, సుధీర్, సూపర్ వైజర్లు సాగర్, సైదులు, సిబ్బంది నరసింహరావు, శ్రీనివాసమూర్తి, జాన్‌ఫెన్ని, శివగణేష్, నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా విభాగం ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి



సమావేశంలోమాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

**తాడేపల్లిరూరల్:** గుంటూరు జిల్లా దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో పంటను భద్రపరచుకుని నష్టపోయిన బాధిత రైతుల సమావేశం దుగ్గిరాలలోని రైలుపేటలోని టర్మరిక్ అసోసియేషన్ హాల్ నందు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పంటను భద్రపరుచుకుని నష్టపోయిన రైతులకు క్వింటాకు రూ.12,500 నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అగ్నిప్రమాద సంఘటన జరిగి ఐదు నెలలు దాటుతున్నా ఇప్పటికీ రైతులకు నష్ట పరిహారం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకట్రామయ్య, శివ సాంబిరెడ్డి, పసుపు రైతులు తదితరులు పాల్గొన్నారు.